హుదూద్ తుఫాన్ ప్రభావం తెలంగాణ ప్రాంతానికి కూడా ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. భారీ నుంచి, అతి భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికలు ఉన్నందున విపత్తును ఎదుర్కొనేందుకు అన్ని రకాలుగా సిద్ధమైంది. తుఫాను ప్రభావం ఉండే జిల్లాల్లో హెల్ప్ లైన్లు, కంట్రోల్ రూములు ఏర్పాటు చేసింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు రెవెన్యూ కార్యదర్శి మీనా, ఇతర అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారు. తగు సలహాలు,సూచనలు ఇస్తున్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులు, సిఎంఓ అధికారులు ఎప్పటికప్పుడు తుఫాను గమనాన్ని, ప్రభావాన్ని తెలుసుకుంటున్నారు.  ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అక్కడి కలెక్టర్లు, మంత్రులు, ఇతర అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఎమ్మార్వో, ఎంపిడివో స్థాయి అధికారులు కూడా స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

తుఫాను ప్రభావం ఆదివారం సాయంత్రం నుంచి తెలంగాణపై, ముఖ్యంగా ఉత్తర తెలంగాణపై ఉంటుందని అంచనాలున్నాయి. భారీ వర్షాల వల్ల చెరువు కట్టలు తెగడం, కాలువలు పొంగిపొర్లడం, లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం లాంటి అనర్థాలు జరిగే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది.  రెవెన్యూ, పోలీస్, ఫైర్, ఆర్ అండ్ బి, మెడికల్, పంచాయితీ రాజ్, నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండడంతో పాటు, పూర్తి సమన్వయంతో విధులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. చెరువు కట్టలకు గండ్లు పడే అవకాశం ఉన్న చోట మరింత అప్రమత్తంగా ఉండాలని, గండ్లు వెంటనే పూడ్చడానికి అవసరమైన సామాగ్రి, సిబ్బందితో సిద్ధంగా ఉండాలని ఆదేశాలు అందాయి. రహదారులపై

కాలువలు, కాజువేలు పొంగిపొర్లే అవకాశం ఉన్న చోట, కాపలాగా మనుషులను పెట్టాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేసి ప్రజలకు సూచనలు, సలహాలు చేయాలని కోరారు. నీటి పారుదల ప్రాజెక్టుల రిజర్వాయర్ల వద్ద కూడా సీనియర్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నాగార్జున సాగర్ వద్ద కూడా పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించుకుంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. రైల్వే లైనుకు సమీపంలో ఉన్న చెరువుల వద్ద కూడా పరిస్థితిని గమనించాలని, రైల్వే ట్రాక్ పైకి నీళ్లొచ్చే అవకాశం ఉంటే వెంటనే అప్రమత్తం చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు మునిగిపోయే ప్రమాదం ఉన్నందున అక్కడి ప్రజలకోసం పునారావాసాలను సిద్ధం చేయాలని, ఆహార ధాన్యాలను కూడా నిల్వ ఉంచుకోవాలని స్థానిక అధికారులకు ఆదేశాలు అందాయి.

సెక్రటేరియట్ లో 23454088, 23454293 నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రాలు, డివిజన్ కేంద్రాలు, మండల కేంద్రాల్లో కూడా కంట్రోల్ రూములు ఏర్పాటు అయ్యాయి. ప్రజలు ఎలాంటి సహాయం కావాలన్నా, సమాచారం కావాలన్నా ఈ నెంబర్లకు ఫోన్ చేయవచ్చు. ఈ కంట్రోల్ రూములు తుఫాను ముప్పు పూర్తిగా తొలగిపోయే వరకు 24 గంటలపాటు పనిచేస్తాయి.